


# సూర్య

www.suryaa.com

**EVENING EDITION**

పేజీలు: 02

www.suryaa.com





ELECTION SPECIAL 2023

## మంచు విష్ణు కన్నప్ప ఫస్ట్ లుక్




టాలీవుడ్ డైనమిక్ స్టార్ మంచు విష్ణు హీరోగా తన కెరీర్ లోనే బిగ్గెస్ట్ అండ్ తన డ్రీం ప్రాజెక్ట్ అయినటువంటి "కన్నప్ప" చిత్రాన్ని ఇప్పుడు చేస్తున్న సంగతి తెలిసిందే. మరి ప్లానింగ్ లతో ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తున్నాడు. మరి న్యూజిలాండ్ లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి అయితే ఈరోజు మంచు విష్ణు పుట్టినరోజు కానుకగా అయితే ఫస్ట్ లుక్ పోస్టర్ ని రివీల్ చేశారు. మరి దీనిని అయితే ఇంట్రెస్టింగ్ విజువల్స్ తో అందించారు అని చెప్పాలి. బాణం విల్లు పట్టుకొని ప్రకృతి మహా శివలింగం ముందు ఎక్కుపెట్టిన వారియర్ గా ఇందులో కనిపిస్తున్నాడు. దీనితో వెంటనే ఆడియెన్స్ కి ఈ సినిమాతో మాత్రం తాను మంచి ట్రీట్ ఇవ్వబోతున్నాడు అనేలా ఉందని చెప్పాలి. ఇక ఈ సినిమాలో అనేక మంది గ్రాండ్ తారాగణం కనిపించనుండగా మణిశర్మ మరియు స్టీఫెన్ దేవస్సి లు సంగీతం అందిస్తున్నారు. అలాగే భారీ బడ్జెట్ తో మోహన్ బాబు ఈ సినిమాని నిర్మాణం వహిస్తున్నారు.

## థ్రిల్లింగ్‌గా చైయ్ దూత ట్రైలర్.!




అక్కినేని యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అక్కినేని నాగ చైతన్య మెయిన్ లీడ్ లో చేస్తున్న అవైటెడ్ ఓటిటి సిరీస్ "దూత". దీనితోనే తాను ఓటిటి డెబ్యూ ఇస్తుండగా ఈ సిరీస్ పై ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. మరి ఇప్పుడు ఈరోజు చైతు బర్త్ డే కానుకగా మేకర్స్ ట్రైలర్ ని అయితే ఫైనల్ గా రిలీజ్ చేశారు. మరి ఈ ట్రైలర్ మంచి ఆసక్తిగా ఉందని చెప్పాలి. చైతు ఓ న్యూస్ జర్నలిస్ట్ గా కనిపిస్తుండగా తనకి సంబంధం లేని ఓ క్రైమ్ లో తాను ఇరుక్కున్నట్టుగా కనిపిస్తుంది. అలాగే దర్శకుడు విక్రమ్ కె కుమార్ చూపించిన సస్పెన్స్ ఫ్యాక్టర్ అయితే మంచి థ్రిల్లింగ్ గా అనిపిస్తుంది. అలాగే తన పాత్రలో చైతు చాలా పర్ఫెక్ట్ గా సెట్ అయ్యాడు. తన లుక్స్ కానీ యాక్షన్ నటన అన్నీ అలవోకగా చేసాడు. వీటితో అయితే ఈ ట్రైలర్ మాత్రం మంచి ప్రామిసింగ్ గా ఉందని చెప్పాలి. ఇక ఈ సిరీస్ ఈ డిసెంబర్ 1న ప్రైమ్ వీడియోలో పాన్ ఇండియా భాషల్లో స్ట్రీమింగ్ కి రాబోతుంది.




## వైఎస్ఆర్ కళ్యాణమస్తు,షాదీ తోఫా నిధులు విడుదల చేసిన సీఎం జగన్

ఏపీలో వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా నిధులు విడుదల అయ్యాయి. క్యాంపు కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం జగన్ నిధుల విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద తల్లిదండ్రులు తమ పిల్లలను గొప్పగా చదివించి, గౌరవప్రదంగా పెళ్లిళ్లు చేసి, వివాహ జీవితాలను మొదలు పెట్టించే కార్యక్రమంలో సాయంగా ఉండే ఒక మంచి కార్యక్రమం అని అన్నారు.పేద వర్గాలైన ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, దివ్యాంగులు భవన నిర్మాణ కార్మికులు అందరినీ ప్రతి సందర్భంలో నా వాళ్లు అంటూ వారి మీద ఓనర్ షిప్ తీసుకుంటూ, ప్రభుత్వంలో అత్యంత ముఖ్యమైన వాళ్లు అంటూ భరోసా ఇస్తూ, చేయి పట్టుకుని నడిపిస్తున్నామని తెలిపారు. ఈరోజు ఈ పథకం ద్వారా జూలై నుంచి సెప్టెంబర్ వరకు జరిగిన పెళ్లిళ్లకు సంబంధించి 10,511 మంది జంటలకు 81.64 లక్షల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి నేరుగా వారి తల్లుల ఖాతాల్లోకి జమ చేస్తున్నామని తెలిపారు.ఈ పథకంలో ఇప్పటివరకు మూడు త్రైమాసికాల్లో మూడు విడతల్లో ఈ ఆర్థిక సాయం అందించామని చెప్పారు. 2022 అక్టోబర్ నుంచి మొదలు పెడితే ఇవాళ్టికి ఈరోజు ఇస్తున్న నాలుగో విడతతో కలిపి 46,062 జంటలకు రూ.349 కోట్లు ఆ తల్లుల ఖాతాల్లోకి జమ చేయడం జరుగుతోందన్నారు.



## ఆస్ట్రేలియాతో టీమిండియా ఢీ

### వైజాగ్‌లో నేడు తొలి టీ20

**రాత్రి 7 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో లైవ్**

వన్డే వరల్డ్ కప్ ముగిసిన నాలుగు రోజుల్లోనే కొత్త సవాల్‌కు రెడీ అయింది. వరల్డ్ కప్ ఫైనల్ ఓటమి బాధను మరిచిపోయి కొత్త కెప్టెన్, కొత్త ఫార్మాట్‌లో యువ ఆటగాళ్లతో తమ పోరాటాన్ని సరికొత్తగా ఆరంభించనుంది. వరల్డ్ కప్‌లో తమకు గుండె కోతను మిగిల్చిన ఆస్ట్రేలియాతో టీ20ల్లో పోటీ పడనుంది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా గురువారం వైజాగ్‌లో జరిగే తొలి మ్యాచ్‌లో సూర్యకుమార్ కెప్టెన్సీలోని ఇండియా శుభారంభమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. తొలిసారి నేషనల్ టీమ్ కెప్టెన్సీ చేపట్టిన సూర్య ఈ సిరీస్‌లో పలువురు నెక్ట్స్ జనరేషన్ ప్లేయర్లను నడిపించబోతున్నాడు. వరల్డ్ కప్‌లో నిరాశ పరిచిన సూర్య తన కిష్టమైన ఫార్మాట్‌లో బ్యాటర్‌గానూ సత్తా చాటాల్సిన అవసరం ఉంది. వచ్చే ఏడాది జూన్-జులైలో టీ20 వరల్డ్ కప్ ఉన్న నేపథ్యంలో ఈ సిరీస్‌లో పలువురు యువ ప్లేయర్లకు సెలెక్టర్లు చాన్స్ ఇచ్చారు. ఆసీస్‌పై సత్తా చాటితే వారి కాన్ఫిడెన్స్ పెరగనుంది. యశస్వి జైస్వాల్, రింకూ సింగ్, తిలక్ వర్మ, జితేశ్ శర్మతో పాటు ముకేశ్ కుమార్ ఇప్పటికే ఇంటర్నేషనల్ డెబ్యూ చేసినప్పటికీ ఇప్పుడు బలమైన ఆసీస్ రూపంలో వారికి అసలైన పరీక్ష ఎదురవనుంది. వరల్డ్ కప్ విన్నర్ ఆసీస్ ఆ టోర్నీలో ఆడిన మెజారిటీ ప్లేయర్లకు రెస్ట్ ఇచ్చింది. అయినా వరల్డ్ కప్ హీరోలు ట్రావిస్ హెడ్, మ్యాక్స్‌వెల్, స్పిన్నర్ ఆడమ్ జంపా, మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్, ఐపీఎల్‌లో అదరగొట్టిన స్టొయినిస్, నేథన్ ఎల్లిస్, టిమ్ డేవిడ్ వంటి ప్లేయర్లతో బలంగా ఉంది. ఈ టీమ్‌ను సీనియర్ కీపర్-బ్యాటర్ మాథ్యూ వేడ్ నడిపిస్తున్నాడు. కేన్ రిచర్డ్ సన్, ఎల్లిస్, అబాట్, బెరెండార్ఫ్‌లతో బౌలింగ్ కూడా పటిష్టంగా కనిపిస్తోంది. వరల్డ్ కప్ ఆడి అలసిపోయిన నేపథ్యంలో మ్యాక్సీ, జంపా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగే అవకాశం కనిపించడం లేదు.

### మొదటి టీ20కు భారీ వర్ష సూచన..

వరల్డ్ కప్ తర్వాత టీమిండియా కొత్త సిరీస్ కు సిద్ధమైంది. స్వదేశంలో ఆస్ట్రేలియాతో 5 టీ20 మ్యాచ్ ల సిరీస్ లో భాగంగా నేడు(నవంబరు 23) తొలి టీ20 ఆడనుంది. వైజాగ్ వేదికగా ఈ మ్యాచ్ సాయంత్రం 7 గంటలకు ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది టీ20 వరల్డ్ కప్ ఉండడంతో ఈ సిరీస్ ను ఇరు జట్లు సీరియస్ గా తీసుకుంటున్నాయి. అంతా బాగానే ఉన్నా నేడు జరిగే టీ20 మ్యాచ్ కు వర్షం పడే అవకాశం ఎక్కువగా కనిపిస్తుంది.

### కుర్రాళ్లకు కీలకం


2022 వరల్డ్ కప్ సెమీస్ ఓటమి తర్వాత కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ ఈ ఫార్మాట్‌లో ఆడటం లేదు. ఈ నేపథ్యంలో ఈ టోర్నీలో సత్తా చాటే యంగ్‌స్టర్స్‌ను వచ్చే టీ20 వరల్డ్ కప్‌నకు పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంటుంది. కుర్రాళ్లలో రింకూ సింగ్, హైదరాబాదీ తిలక్ వర్మ ఆడిన కొన్ని మ్యాచ్‌ల్లోనే అందరినీ మెప్పించారు. యశస్వి జైస్వాల్, ముకేశ్ కూడా ఆకట్టుకున్నారు. అయితే, ఇప్పటిదాకా వెస్టిండీస్, ఐర్లాండ్ వంటి సాధారణ ప్రత్యర్థులు, ఆసియా గేమ్స్‌లో బి గ్రేడ్ టీమ్స్‌ను ఎదుర్కొన్న ఈ యంగ్‌స్టర్స్‌కు ఆసీస్‌తో పాటు సౌతాఫ్రికా టూర్‌లో, సొంతగడ్డపై అఫ్గానిస్తాన్‌తో జరగబోయే టీ20 సిరీస్‌లు కీలకం కానున్నాయి. మొత్తంగా ఐపీఎల్‌కు ముందు ఇండియా 11 ఇంటర్నేషనల్ టీ20లు ఆడనుంది. ఆ తర్వాత పూర్తిగా టీ20 వరల్డ్ కప్ మోడ్‌లోకి వెళ్లింది. ఈ నేపథ్యంలో వరల్డ్ కప్ టీమ్‌లో ప్లేస్ ఆశిస్తున్న యంగ్‌స్టర్స్ లైఫ్‌లో రాబోయే రెండు నెలలు అత్యంత కీలకం కానున్నాయి. ఇక, ఈ సిరీస్‌లో కోచ్‌గా వ్యవహరిస్తున్న వీవీఎస్ లక్ష్మణ్ ఇండియా బ్యాటింగ్ లైనప్ విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనేది ఆసక్తి కలిగిస్తోంది.



## 25 నుంచి 27 వరకు ప్రధాని మోదీ ప్రచారం

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ మరింత ముమ్మరం చేయనుంది. ఇందులో భాగంగా ప్రధాని మోదీ ఈ నెల 25 నుంచి 27 వరకు వరుసగా మూడు రోజుల్లో ఆరు సభల్లో పాల్గొననున్నారు. 25న మహేశ్వరం, కామారెడ్డి, 26న తుఫ్రాన్, నిర్మల్, 27న మహబూబాబాద్, కరీంనగర్ సభలకు ఆయన హాజరు కానున్నారు. 27న సాయంత్రం ఎల్బీనగర్ నుంచి మియాపూర్ వరకూ 40 కిలోమీటర్ల పొడవునా మోదీతో రోడ్ షో నిర్వహించేందుకు కూడా పార్టీ ప్లాన్ చేస్తున్నది. ఇక కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా మరోసారి రాష్ట్రానికి రానున్నారు. ఈ నెల 24న యూపీ సీఎం యోగి, 25 నుంచి అమిత్ షా, నడ్డా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జరగనున్న ప్రచార సభల్లో పాల్గొననున్నారు. కాగా, బుధవారం అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ మలక్ పేటలో, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప జహీరాబాద్ లో, బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తేజస్వి సూర్య వనపర్తిలో, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వరంగల్ ఈస్ట్ నియోజకవర్గంలో, తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై మల్కాజిగిరిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

## శబరిమల భక్తులకు రెడ్ అలెర్ట్ జారీ



జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ముఖ్యంగా రాత్రి వేళల్లో శబరిమలకు వెళ్లే సమయంలో, తిరిగి ప్రయాణం చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని యాత్రికులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. మరోవైపు సహాయక బృందాలు అలర్ట్ గా ఉండాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన అధికారులు, శబరిమలకు వెళ్లే భక్తులు భారీ వర్షాల నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకోవాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు ప్రస్తుతం మండల పూజలో భాగంగా డిసెంబర్ 27వ తేదీ వరకు స్వామి వారిని దర్శించుకునే అవకాశం కల్పించారు. మకరజ్యోతికి ఇక డిసెంబర్ 31వ తేదీ నుంచి వచ్చే సంవత్సరం జనవరి 15వ తేదీ వరకు అయ్యప్ప స్వామి వారికి మకర జ్యోతి పూజలు కొనసాగుతాయి. మకర సంక్రాంతి రోజున సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు మకర జ్యోతి దర్శనంతో వార్షిక ఉత్సవాలు పతాక స్థాయికి చేరుకుంటాయి. అత్యంత ఘనంగా అయ్యప్ప వార్షిక వేడుకలు జరుగుతాయి. కాగా ప్రస్తుతం రెండు నెలల పాటు జరిగే వార్షిక మండలం-మకరవిళక్కు వేడుకల తీర్థయాత్రలో భాగంగా పతనంతిట్ట జిల్లాలోని శబరిమలలోని అయ్యప్ప స్వామి కొండపైకి వెళ్లే వేలాది మంది భక్తులకు భారీ వర్షం తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తుంది.



## అధికారంలోకి రాగానే జీవో 69ని అమలు చేస్తాం

### ఈటల రాజేందర్

బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే మక్తల్ నియోజవర్గ ప్రజలు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న జీవో 69ని అమలు చేస్తామని ఆ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్ రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగులో ఈటల మాట్లాడారు. బీజేపీ నుంచి ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్‌పర్సన్‌ను గెలిపించుకున్న గడ్డ ఈ మక్తల్ అడ్డా అని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో మక్తల్ గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. రాష్ట్రంలో కేసీఆర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలకు అహంకారం ఎక్కువైందన్నారు. అవినీతి సీఎంను గద్దె దింపాలని.. ఉద్యమ సమయంలో ఉపాసమున్న వ్యక్తి, పదేండ్లు సీఎంగా అధికారంలో ఉండి వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నాడని విమర్శించారు. మక్తల్‌లో అవినీతి పాలన పోవాలంటే ప్రతి ఒక్కరూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి జలంధర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కోలార్ ఎంపీ మునిస్వామి, నాగురావు నామాజీ, కొండయ్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, బలరాం రెడ్డి. మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, వైస్ చైర్‌పర్సన్ అఖిల పాల్గొన్నారు.



## తెలుగు తమ్ముళ్లను ఓటు అడిగే హక్కు నాకే ఉంది

### బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి నియోజకవర్గంలో టీడీపీని చివరి వరకు కాపాడిన ఏకైక కార్యకర్తను తానేనని, ఇక్కడ తెలుగు తమ్ముళ్లను ఓటు అడిగే హక్కు తనకు మాత్రమే ఉందని బీఆర్ఎస్అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య చెప్పారు. బుధవారం పెనుబల్లి మండలంలోని పలు గ్రామాలలో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. సత్తుపల్లి నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యే గా గెలిపిస్తే ఒక సేవకుడిగా ప్రజలకు కోసం పనిచేశానని చెప్పారు. దళితబంధు పై కొంతమంది కావాలని అసత్య ప్రచారం చేస్తున్నారని, క్రిస్మస్ లోపు దళితబంధు అమలు చేయకపోతే సర్పంచ్, ఎంపీటీసీల ఎన్నికలలో ఓట్లు కూడా అడగబోనని తెలిపారు. ఎన్నికలైన వారం రోజులలోనే యాదవులకు రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్కినేని అలేఖ్య, జడ్పీటీసీ చెక్కిలాల మోహనరావు, పార్టీ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, నీలాద్రీ చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరావు, మండల నాయకులు చెలికాని నీలాద్రీబాబు, మందడపు అశోక్ , కనగాల సురేశ్, తెల్లగొర్ల జనార్ధన్, చెక్కిలాల లక్ష్మణరావు, యడ్ల సుబ్బారావు, రామప్ప, పొట్లపల్లి శంకర్, లక్కినేని వినీల్ తదితరులు పాల్గొన్నారు.



## కేసీఆర్ దమ్ముంటే .. ఆ లెటర్లు బయటపెట్టు

### కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

రాష్ట్రంలో మెడికల్ కాలేజీల కోసం కేంద్రానికి 100 లెటర్లు రాశానంటున్న కేసీఆర్... దమ్ముంటే ఆ లేఖలను బయటపెట్టాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. "మెడికల్ కాలేజీల కోసం దరఖాస్తు చేసుకోవాలని అప్పటి కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ రాష్ట్రానికి లేఖ రాశారు. కానీ కేసీఆర్ స్పందించలేదు. చివరకు నేను కూడా లెటర్ రాశాను. అయినా పట్టించుకోలేదు. కానీ ఇప్పుడేమో కేంద్రం మెడికల్ కాలేజీలు ఇవ్వలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారు' అని మండిపడ్డారు. బుధవారం బీజేపీ మీడియా సెంటర్ లో కిషన్ రెడ్డి మాట్లాడారు. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు ఎందుకు ఆలస్యమవుతుందో కేసీఆర్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. "రూ.26 వేల కోట్ల ప్రాజెక్టులో గజం భూమి కూడా రాష్ట్ర ప్రభుత్వం సేకరించలేదు. అందులో సగం డబ్బులిస్తామన్నా రాష్ట్ర సర్కార్ స్పందించలేదు. రాష్ట్రానికి సైనిక్ స్కూల్ ఇస్తే అగ్రిమెంట్ చేసుకుని, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వెనకడుగు వేసింది' అని చెప్పారు. "కేంద్రం నుంచి నిధులు రానందునే రాష్ట్రంలో పథకాలు అమలు చేయడంలో ఆలస్యమవుతోందని కేసీఆర్ చెప్తున్నవన్నీ అబద్ధం. తలాతోకా లేకుండా కేసీఆర్ మాట్లాడుతున్నారు. ఈ 9 ఏండ్లలో రాష్ట్రానికి కేంద్రం రూ.9 లక్షల కోట్లు ఇచ్చింది' అని స్పష్టం చేశారు.

## రాజకీయ నిరుద్యోగులే మార్పు కోరుకుంటున్నారు

**మంత్రి కేటీఆర్**



తెలంగాణలో మార్పు కావాలని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంపై మంత్రి కేటీఆర్ స్పందించారు. రాష్టంలో కొత్తగా రావాల్సిన మార్పు ఏమీ లేదని, 2014లోనే ప్రత్యేక రాష్ట్రం రూపంలో మార్పువచ్చిందని తెలిపారు. ఇప్పుడు కూడా రాజకీయ నిరుద్యోగులే తప్ప ప్రజలు దాని గురించి ఆలోచించడం లేదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కు 80సీట్లు వస్తాయని మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ నెంబర్ 02 స్థానం కోసం పోటీ పడుతున్నాయని విమర్శించారు. హైదరాబాద్ పరిధిలో టూరిస్టు ప్రాంతాలు తక్కువగా ఉన్నాయని .. ఈ సారి తనకు టూరిజం శాఖ ఇవ్వాలని సీఎంను కోరుతానని కేటీఆర్ చెప్పారు.

## కొత్త లుక్ లో తారా సుతారియా

నటి తారా సుతారియా గ్లామరస్ లుక్‌లో కనిపించింది, చిత్రాలను చూడండి. బాలీవుడ్ నటి తారా సుతారియా తన కొత్త ఫోటో షూట్ గురించి చర్చలో ఉంది. నటి వెండి దుస్తులలో అద్భుతమైన చిత్రాలను పంచుకుంది. తార వివిధ దుస్తులలో పోజులిచ్చింది. తారా సుతారియా యొక్క ఈ ఆకర్షణీయమైన దుస్తులు వైరల్ అవుతున్నాయి. తారా సుతారియా యొక్క ఈ హాట్ చిత్రాలను అభిమానులు ఇష్టపడుతున్నారు. తారా సుతారియా సుప్రసిద్ధ బాలీవుడ్ నటి. తార తన అద్భుతమైన నటనకు పేరుగాంచింది. తార కొత్త లుక్ అభిమానులకు నచ్చింది.



# హంగ్ కోసం బీజేపీ యత్నం

## మీట్ ది ప్రెస్‌లో ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ




'రాష్ట్రంలో హంగ్ అసెంబ్లీ కోసం బీజేపీ ప్రయత్నిస్తోంది. ఈసారి ఇక్కడ పప్పులు ఉడకడం లేదని పసిగట్టింది. దీంతో రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడాలని చూస్తోంది. దాని ఫలితంతో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలని భావిస్తోంది. వచ్చే ఐదేళ్లలో సంకీర్ణంతో బలోపేతం కావాలనుకుంటోంది. ప్రజలు మజ్లిస్‌కు 9, బీఆర్ఎస్‌కు 110 సీట్లలో సంపూర్ణ మద్దతు ఇచ్చి.. కేసీఆర్ మామకు అధికారం కట్టబెట్టాలి' అని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు. బధవారం టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

**కాంగ్రెస్‌తోనే బీజేపీ గ్రాఫ్ పెరుగుతోంది**

కాంగ్రెస్ అసమర్థత వల్లే బీజేపీ గ్రాఫ్ పెరుగుతోంది. కేంద్రంలో వరుసగా గెలుస్తోంది. రాహుల్ గాంధీ నాయకత్వంలోనే ఎంపీల బలం 50కి పడిపోయింది. మోదీ ప్రధాని కావడానికి ఆయనే కారణం. తమ అసమర్థత కప్పిపుచ్చుకోవడానికి కోపమంతా మజ్లిస్‌పై ప్రదర్శిస్తున్నారు. ఓట్లు చీల్చుతున్నామని అపవాదు అంటకడుతున్నారు. అమేథీలో మజ్లిస్ పోటీ చేయకపోయినా స్మృతి ఇరానీ చేతిలో రాహుల్ ఓడిపోయారు. తాత ముత్తాత, నానమ్మ సీట్లను కూడా కాపాడుకోలేకపోయారు. కేరళలోని వయనాడ్‌లో ముస్లిం లీగ్ సహకారంతో 30 శాతం ముస్లిం ఓట్లతో రాహుల్ గెలిచారు. శివసేనతో అధికారం పంచుకున్నప్పుడు కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ ఎలా అవుతుంది. ఎంఐఎం, బీఆర్ఎస్ కోసం తలుపులు మూసేశామని రాహుల్ చెబుతున్నారు. ఇండియా కూటమిలో మేము ఎలా భాగస్వాములం అవుతాం.

**అజహరుద్దీన్.. అసమర్థ రాజకీయవాది**

అజహరుద్దీన్ మంచి క్రికెటరే.. కానీ, రాజకీయాల్లో అసమర్థుడు. యూపీలోని మొరాదాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ప్రజలు గెలిపిస్తే అక్కడ ఎలాంటి అభివృద్ధి చేయలేదు. ఆ తర్వాత రాజస్తాన్‌కు పంపిస్తే అక్కడ ఓడిపోయారు. ఆ తర్వాత తిరిగి ముఖం చూపించలేదు. సొంతగడ్డపై కేటీఆర్ ఆయనకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ బాధ్యతలు అప్పగిస్తే దాని స్థాయి దిగజార్చారు. ఆయన అవినీతిపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఎన్నికల్లో ప్రత్యర్థులు ఇద్దరు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారైతే తప్పేంటి? అసమర్థ నేత కాబట్టి ఆయనపై బలమైన మజ్లిస్ అభ్యర్థిని రంగంలోకి దింపాం.

**కాంగ్రెస్ చీఫ్ పక్కా ఆర్ఎస్ఎస్‌వాది**

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గతంలో ఏబీవీపీలో పని చేశారు. కార్వాన్‌లో కిషన్ రెడ్డి పోటీ చేసినప్పుడు ఆయనకు మద్దతుగా గుడిమల్కాపూర్‌లో ప్రచారం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ఆయనను టీడీపీకి పంపిస్తే ఆ పార్టీ అడ్రస్ తెలంగాణలో గల్లంతైంది. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సూచనతో కాంగ్రెస్‌లో చేరారు. మోహన్ భగవత్ రిమోట్ కంట్రోల్‌తోనే గాంధీభవన్ పని చేస్తోంది. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే. హైదరాబాద్‌లో మజ్లిస్ బలంగా ఉంది కాబట్టి తెలంగాణలో మైనార్టీ డిక్లరేషన్ ప్రకటించారు. కానీ కర్ణాటక, రాజస్తాన్, మధ్యప్రదేశ్, మిజోరం, ఛత్తీస్‌గఢ్‌లలో ఎందుకు ప్రకటించలేదో సమాధానం చెప్పాలి? అక్కడ ముస్లింలు లేరా..? లేక వారి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదా?

**బీఆర్ఎస్‌తో ఎలాంటి పొత్తులేదు**

బీఆర్ఎస్‌తో మజ్లిస్‌కు ఎలాంటి పొత్తు లేదు. ఫ్రెండ్లీ పార్టీ మాత్రమే. బీజేపీతో కలిసే ప్రసక్తే లేదు. కాంగ్రెస్, బీజేపీ మధ్య సంబంధం ఉంది. మేము ఎవరికీ బీ-టీమ్ కాదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తోంది కాబట్టి సమర్థిస్తున్నాం. బీజేపీతో కేసీఆర్‌కు సంబంధం ఉంటే.. తొమ్మిదిన్నరేళ్లలో మైనారిటీల కోసం పెద్దఎత్తున బడ్జెట్ కేటాయింపు జరిగేదా? 201 మైనార్టీ గురుకులాల ఏర్పాటు చేసేవారా? ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌తోపాటు ఏటా రూ.650 కోట్లు ముస్లింల విద్య కోసం ఖర్చు పెట్టేవారా? కేసీఆర్ మూడోసారి సీఎం అవుతారు. తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. భైంసా ప్రశాంతంగా ఉంది. కాంగ్రెస్ అధికారంలో ఉంటే మతఘర్షణలు జరుగుతాయి. మత సామరస్యం దెబ్బతింటుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం కల్ల.

**మతప్రాతిపదిక రిజర్వేషన్ కాదు**

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అమలవుతున్న 4 శాతం రిజర్వేషన్లు మత ప్రాతిపదికన చేసినవి కావు. ముస్లిం సామాజిక వర్గంలో ఆర్థికంగా, విద్యాపరంగా వెనకబడిన వారికి మాత్రమే అమలు చేస్తున్నారు. అదీ పీఎస్ కృష్ణన్, మండల్ కమిషన్ రిపోర్టు ప్రకారం సుప్రీంకోర్టు ఆదేశాలతో రిజర్వేషన్ అమలవుతోంటే బీజేపీకి వచ్చిన ఇబ్బందేంటి? తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి మోదీ ప్రభుత్వానికి పంపితే మంజూరు చేయలేదు. బీజేపీ ఇప్పుడు దీన్ని రద్దు చేస్తామని చెబుతోంది. పాఠ్యపుస్తకాల్లో గాం«దీని అవమానపర్చి.. గాంధీని చంపిన గాడ్సే గురించి చదివిస్తున్నారు.



## హైదరాబాద్ లో వాన జల్లులు.. తడిసి ముద్దయిన నగరం

హైదరాబాద్ లో పలుచోట్ల వర్షం కురుస్తుంది. నగరంలోని అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తున్నాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాధాపూర్, ఫిల్మ్ నగర్, అమీర్ పేట్, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి, చిలుకలగూడ, బేగంపేట, ప్యాట్నీ, అల్వాల్, తిరుమలగిరి, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, జీడిమెట్ల, ఆల్విన్ కాలనీ, బాచుపల్లి, నిజాంపేట్, క్రైపర, ఈసీఐఎల్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మాదాపూర్, హైటెక్ సిటీ, కుత్బుల్లాపూర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్, పంజాగుట్ట తదితర ప్రాంతాల్లో వర్షం కురుస్తుంది. ఉదయం నుంచి నగరంలో మబ్బులు కమ్ముకున్నాయి. వాతావరణం చల్లగా మారింది. దీంతో కాసేపటికే నగరానికి మేఘాలు కమ్ముకున్నాయి. కాగా.. ఇవాళ ఉదయం 8 గంటల నుంచి వాన కురుస్తుంది. చలితో వణుకుతున్న భాగ్యనగర వాసులకు వాన పడటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్ తో పాటు శివారు ప్రాంతాల్లోనూ పలు చోట్ల వర్షం కురుస్తుంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు నిన్న తూర్పుగాలులకు సముద్రమట్టానికి 3.1 కిలో మీటర్ల ఎత్తు వరకు ఏర్పడిన అల్పపీడనం నేడు బలహీనపడిందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వైపు తూర్పు, ఈశాన్య దిశల నుంచి గాలులు వీస్తున్నాయని అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో తెలికపాటి తెలంగాణ రాష్ట్రంలో నేడు, రేపు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి వెల్లడించిన విషయం తెలిసిందే. ఎల్లుండి రాష్ట్రంలో తెలికపాటి నుంచి కొన్ని చుక్కల వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణలో వర్షాలపై వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. నేటి నుంచి 3 రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.


## బిర్యానీ కోసం డబ్బు ఇవ్వలేదని యువకుడిని

**60 సార్లు పొడిచి చంపిన 16 ఏండ్ల కుర్రాడు**




దేశ రాజధాని ఢిల్లీలో దారుణం జరిగింది. బిర్యానీకి పైసలు ఇవ్వలేదని 17 ఏండ్ల యువకుడిని ఓ కుర్రాడు పొడిచి చంపాడు. యువకుని మెడ, ఛాతీపై 60 పొడిచిన నిందితుడు.. నిర్జీవంగా పడి ఉన్న అతనిపై డ్యాన్స్ చేశాడు. బాధితుడైన 17 ఏండ్ల యువకుడు ఢిల్లీలోని జాఫ్రాబాద్ ప్రాంతంలో తన తల్లితో కలిసి ఉంటున్నాడు. రోజువారీ కూలీ అతడు.. మంగళవారం రాత్రి జనతా మజ్దూర్ కాలనీ మీదుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఓ 16 ఏండ్ల కుర్రాడు అతడిని అడ్డగించాడు. బిర్యానీ తినడానికి రూ.350 కావాలని ఆ యువకుడిని అడిగాడు. అయితే తన వద్ద అంత డబ్బు లేదని చెప్పడంతో ఆవేశానికి లోనైన ఆ కుర్రాడు అతడిని కొట్టాడు. దీంతో కిందపడిపోయిన బాధితుడిపై కూర్చున్న నిందితుడు.. మెడ, ఛాతీపై విచక్షణారహితంగా కత్తితో 60 సార్లు పొడిచాడు. తీవ్రంగా గాయపడిన అతడు చనిపోయాడు. అప్పటికీ శాంతించని ఆ కుర్రాడు అతని దేహంపై డ్యాన్స్ చేశాడు. గమనించిన స్థానికులు ఆ యువకుడిని దవాఖానాకు తీసుకెళ్లారు. అయితే అప్పటికే అతడు మృతిచెందాడని వైద్యులు తెలిపారు. ఇదంతా ఆ ప్రాంతంలో ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డయింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడైన కుర్రాడు కూడా జఫ్రాబాద్‌లోని మురికివాడలో నివసిస్తున్నడాని, అతడు మధ్యలో పాఠశావిద్యను ఆపేశాడని చెప్పారు. ఇద్దరు ఒకరికొకరు తెలియరని వెల్లడించారు. గతంలోనూ అతనిపై ఓ హత్య కేసు ఉన్నదని తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నామని తెలిపారు.

## దేశ రాజధాని ఢిల్లీలో ఒకవైపు కాలుష్యం.. మరోవైపు వణికిస్తున్న చలి!



దేశ రాజధాని ఢిల్లీలో ప్రజల ఊపిరి పీల్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి దిశలో మార్పు, వేగం తగ్గడం వల్ల ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో వాతావరణం మళ్లీ తీవ్ర వర్గానికి చేరుకుంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సీసీపీబీ) తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం జహంగీర్‌పురిలో 434, బవానాలో 441, ద్వారకలో 412, బురారీలో 441, ఆనంద్ విహార్‌లో 387, అశోక్ విహార్‌లో 386గా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) నమోదైంది. ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో పొగమంచు కమ్మేయడంతో పాటు ఉష్ణోగ్రతలు భారీగా తగ్గాయి. పర్వతాలపై మంచు కురుస్తుండటంతో మైదాన ప్రాంతాల్లో చలి పెరుగుతోంది. సాయంత్రం వేళల్లో చలి తీవ్రత పెరుగుతోంది. ఫలితంగా ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోయాయి. బుధవారం కనిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే ఒక డిగ్రీ తక్కువగా 10.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. సగటు గరిష్ట ఉష్ణోగ్రత 26 డిగ్రీలుగా నమోదైంది. ఇది సాధారణం కంటే ఒక డిగ్రీ తక్కువగా నమోదైంది. ఇదిలా ఉండగా వాయు కాలుష్య నియంత్రణకు అనుసరిస్తున్న విధానం తదుపరి దశకు చేరుకుంది. దీంతో రాజధానిలో జీఎన్‌జీ, బీఎస్4 డీజిల్, ఎలక్ట్రిక్ బస్సులు మినహా ఇతర బస్సుల ప్రవేశాన్ని నిషేధించనున్నారు. టూరిస్ట్ బస్సులు, కాంట్రాక్ట్ బస్సులు, రాష్ట్ర రవాణా బస్సులు, డీజిల్ బస్సులు మినహా ఇతర రాష్ట్రాల్లోని అన్ని రకాల పర్మిట్లు కలిగిన బస్సులు ఢిల్లీలోకి ప్రవేశించడాన్ని నిషేధించనున్నట్లు ఒక నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.




## భారీగా పెరిగిన CNG ధరలు

దేశ రాజధాని ఢిల్లీలో గురువారం సీఎన్‌జీ ధరలు భారీగా పెరిగాయి. ఢిల్లీలో సీఎన్‌జీ కిలో ధర రూ.80.20 ఉండగా.. రూ.81.20కు చేరుకుంది. గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్‌తో సహా ఇతర నగరాల్లో ధరలు అదే స్థాయిలో పెరిగాయి. గ్రేటర్ నోయిడాలో ధర రూ.79.20 నుంచి రూ.80.20కి పెరిగింది. రేవారిలో సీఎన్‌జీ ధర ఇప్పటివరకు కిలో రూ.82.20 ఉండగా.. 81.20కి పెరిగింది.



## విశాఖ బోటు ప్రమాద బాధితులకు పరిహారం

ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాదం వల్ల నష్టపోయిన మత్స్యకారులకు ప్రమాదం జరిగిన 48 గంటలు గడవక ముందే జిల్లా కలెక్టర్ అకౌంట్‌కు పరిహారం డబ్బులను సీఎం కార్యాలయం జమ చేసింది. పూర్తిగా కాలిపోయిన 30 బోట్లకు 80 శాతం పరిహారంలో భాగంగా రూ.6,44,80,000, పాక్షికంగా దగ్ధమైన 18 బోట్లు, ఒక వలకు రూ.66.96 లక్షలు పరిహారాన్ని అందించింది. జీవనాధారం కోల్పోయిన హమాలీలు, చిరువ్యాపారులకు ఒక్కో బోటుకు 10మంది చొప్పున మొత్తం 490 మందికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.10వేలు చొప్పున అందించారు.